ఆ వదంతులు నమ్మొద్దు

ప్రజాశక్తి- తిరుమల: మెచ్యూరిటీ పూర్తైన 5వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం బాండ్స్ రూపంలో డిపాజిట్ చేస్తున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని టీటీడీ ఈవో ధర్మారెడ్డి పేర్కొన్నారు. టీటీడీ ఫిక్సిడ్ డిపాజిట్లు విషయంలో ఎలాంటి వదంతులు నమ్మవద్దని ఆయన కోరారు. 15,900కోట్ల టీటీడీ ఫిక్సిడ్ డిపాజిట్లు వివిధ జాతీయ బ్యాంకుల్లో ఉన్నాయన్నారు. కొందరు టీటీడీపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. నవంబర్ 30వ తేదీ బోర్డు మీటింగ్‌లో ఆనంద నిలయం, ఆనంత స్వర్ణమయంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. నూతన పరకామణి భవనంలో త్వరలో శ్రీవారి హుండీ కానుకలు లెక్కింపు ప్రారంభిస్తామన్నారు. అక్టోబర్ నెలలో 22.72 లక్షల మంది శ్రీవారిని దర్శించుకున్నారని, హుండీ కానుకల ద్వారా 122.23కోట్లు ఆదాయం వచ్చిందని తెలిపారు. 1.08కోట్ల మంది శ్రీవారి లడ్డూలు విక్రయం, 10.25లక్షల మంది భక్తులు తలనీలాలు సమర్పణ చేశారని వెల్లడించారు. డిసెంబర్ నుండి ప్రయోగాత్మకంగా విఐపీ బ్రేక్ దర్శనం ఉదయం 8గంటల నుండి మొదలవుతుందని అన్నారు. బ్రేక్ సమయం మార్పు వల్ల అన్‌లైన్‌లో డిసెంబర్ నెల రూ.300ల దర్శనం కోటా జాప్యం ఏర్పడిందని తెలిపారు. త్వరలో ఆన్‌లైన్‌లో దర్శన టిక్కెట్లు విడుదల చేస్తామని పేర్కొన్నారు.

నాడు- నేడు పనులతో...

సంక్షేమ హాస్టళ్లకు మహర్దశ

ఏపీ స్టడీ సర్కిల్‌ను సందర్శించిన మంత్రి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

నాడు-నేడు పనులతో సాంఘిక సంక్షేమ హాస్టళ్లకు, గురుకుల పాఠశాలకు మహర్దశ వస్తోందని, నాణ్యమైన మెను, ఇంగ్లీష్ మీడియం విద్యతో విద్యా వ్యవస్థలో దేశ చరిత్రలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంచి సంస్కరణలు తెచ్చి అభివద్ధి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు.




విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

శనివారం ఉదయం స్థానిక పద్మావతి అతిథి గహం వద్ద మీడియాతో మాట్లాడుతూ నాడు- నేడు కార్యక్రమం కింద రాష్ట్రంలోని అన్ని సంక్షేమ వసతి గహాల్లో, గురుకుల పాఠశాలల్లో టాయిలెట్ల వసతి కాంపౌండ్ వాల్సు ఏర్పాటు తదితర మరమ్మతులు చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పించి వాటిని ఆహ్లాదకరమైన మంచి వాతావరణంలో విద్యార్థులు ఉండేలా చర్యలు చేపడుతున్నామని అన్నారు. తాను కూడా సంక్షేమ హాస్టళ్లలో ఉండి చదువుకున్నానని, అప్పుడు ఇంత మంచి వసతులు, ఆహారం ఉండేవి కాదని, నేడు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వేల కోట్లతో సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు వాటిలో నాణ్యమైన విద్య కొరకు బడ్జెట్ కేటాయించి ఖర్చు చేస్తున్నారని అన్నారు. అలాగే ప్రభుత్వ భవనాల్లో 50% పైగా నాడు-నేడు కింద అభివద్ధి చేస్తున్నామని, నాణ్యమైన ఆహారం అందించే దిశగా మెను ఏర్పాటు చేసామని విద్యార్థులు ఆరోగ్యంగా ఉండే విధంగా డైట్ ఛార్జీలు పెంపుదలపై సమీక్షిస్తున్నామని, ఇంగ్లీష్ మీడియం విద్యతో బలహీన వర్గాలకు చెందిన పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడగలిగే పోటీ ప్రపంచంలో నిలబడగలిగే విధంగా వినూత్నంగా, సర్వాంగ సుందరంగా హాస్టల్లను సంక్షేమ గురుకుల పాఠశాలలను తీర్చి దిద్దుతున్నామని అన్నారు. అనంతరం చెన్నారెడ్డి కాలనీ లోని ఏపీ స్టడీ సర్కిల్ ను మంత్రి సందర్శించి అక్కడ విద్యార్థులతో వారి చదువు, వసతి సౌకర్యాలకు సంబంధించిన విషయాలు తెలుసుకుని సంతప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య తదితరులు ఉన్నారు.

ఎవరికి వారే... పోటాపోటీగా..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తూర్పు రాయలసీమలో పట్టభద్రులు, టీచర్స్ నియోజకవర్గంలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలకు గెలుపు పరంపర కొనసాగుతోంది. ఈ స్థానాల్లో గతంలో టిడిపి నుంచి కోటీశ్వరులు పోటీచేసినా డిపాజిట్లు దక్కలేదు. అయినా ఎన్నికలొచ్చిన ప్రతిసారీ పోటీచేస్తూనే ఉన్నారు. నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు, మేధావులు మాత్రం తమ గళాన్ని నిరంతరం శాసనమండలిలో వినిపిస్తూ క్షేత్రస్థాయిలో ఏ సమస్య వచ్చినా వారికి అండగా ఉండడమే గాకుండా ప్రజా ఉద్యమాల్లో నాయకత్వం వహిస్తున్న వారినే గెలిపిస్తున్నారు. అందుకే ప్రతిసారీ అఖండ మెజార్టీతోనే పిడిఎఫ్ అభ్యర్థులు గెలుస్తున్నారు. ఈసారి అధికార పార్టీ వైసిపి సైతం ఎన్నికల బరిలో దిగింది. పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులుగా పట్టభద్రుల నుంచి మీగడ వెంకటేశ్వరరెడ్డి, టీచర్ల నుంచి పి.బాబురెడ్డి బరిలో ఉన్నారు. వైసిపి నుంచి పట్టభద్రుల నుంచి శ్యాంప్రసాద్ రెడ్డి, టీచర్ల నుంచి చంద్రశేఖర్‌రెడ్డి పోటీలో ఉన్నారు. టిడిపి తరపున పట్టభద్రుల నుంచి శ్రీకాంత్‌రెడ్డి, టీచర్స్ నియోజకవర్గం నుంచి వాసుదేవనాయుడు పోటీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో గెలుపే ధ్యేయంగా అధికార పార్టీ అడ్డదారులు తొక్కుతోంది. టిడిపి అయితే నారాయణ, శ్రీ చైతన్య కాలేజీల్లో నాన్‌టీచింగ్, ప్రైవేట్ టీచర్లను ఓటర్లుగా ఎన్‌రోల్ చేస్తున్నారు.



స్వచ్ఛందంగా ఓటు ఎన్‌రోల్ చేసుకుంటున్న పట్టభద్రులు

ఇక అధికార పార్టీ వైసిపి 'మీరు డబ్బులు ఖర్చు పెడతారో, బెదిరిస్తారో.. కాళ్లు పట్టుకుంటారో.. తెలియదు.. ఎలాగైనా తూర్పు రాయలసీమ పట్టభద్రుల స్థానం వైసిపి కైవసం చేసుకోవాలి' అని క్యాడర్‌కు వైసిపి 'పెద్దలు' హుకుం జారీ చేశారు. ఓట్ల చేర్పింపుకు ఆఖరి తేదీ ఇంకా రెండు రోజులే ఉండడంతో సచివాలయాల్లో నానా హైరానా పడుతోంది. సచివాలయం వాలంటీర్లను, ఉద్యోగులను కార్యకర్తలుగా మార్చేశారు. రాష్ట్రంలో కీలకంగా ఉన్న జిల్లాకు చెందిన మంత్రి ఇదే పనిలో నిమగ్నమయ్యారు. 'గడప గడపకూ ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎంఎల్‌ఎలు ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారంగా మార్చేశారు. గత 15 రోజుల క్రితం నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు తూర్పు రాయలసీమ పట్టభద్రులు నియోజకవర్గంలో 90వేల ఓట్లు మాత్రమే చేరాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పట్టభద్రుల సీటు వైసిపికి 'చావో రేవో'గా మారిపోయింది. ఒక్కసారిగా ఓట్ల చేర్పింపు పెద్దమొత్తంలో చేయించాలని ఆదేశాలు అందడంతో కొన్ని దొంగోట్లు కూడా చేరుతున్నట్లు సమాచారం. నిజమైన పట్టభద్రులు ఎంఇఒ కార్యాలయంలోకి వెళితే ఆన్‌లైన్‌లో చేసుకోవాలని, తమ వద్ద గుట్టలు గుట్టలుగా దరఖాస్తులు ఉన్నాయని తిప్పి పంపేస్తున్నారు. వైసిపి శ్రేణులు అందరూ అక్కడే తిష్టవేసి ఎటువంటి 'వెరిఫికేషన్' లేకుండానే ఆన్‌లోన్‌లో అప్‌లోడ్ చేయిస్తున్నారు. టిడిపి పరిస్థితికి వస్తే ప్రతిసారీ ఓటమిని చవిచూస్తున్న ఆ పార్టీ మద్దతుదారులకు వైసిపి అక్రమాలే తమను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. చంద్రగిరి, తిరుచానూరు, శ్రీకాళహస్తి, గూడూరు, నెల్లూరు ప్రాంతాల్లో భారీగా సమావేశాలను ఏర్పాటు చేసి రెండూ గెలిచి తీరాలని శ్రేణులకు నొక్కి చెబుతున్నారు.

ప్రజాదృష్టి

జిల్లాలు	పట్టభద్రులు	టీచర్లు
1. బాపట్ల	14,104	515
2. ప్రకాశం	53,763	2157
3. నెల్లూరు	59,708	3724
4. చిత్తూరు	28,393	1268
5. తిరుపతి	51,517	2811
6. అన్నమయ్య	12,838	482

ప్రస్తుతం ఈ మూడు జిల్లాల పరిధిలో శుక్రవారానికి 2 లక్షల 20వేల 323 నమోదు చేసుకున్నారు. టీచర్ నియోజకవర్గానికి సంబంధించి 10,957 మంది చేరారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని పట్టభద్రులు స్వతంత్రంగా వెళితే కుంటిసాకులు చెబుతూ పంపించేస్తున్నారు. స్వతంత్రంగా చేరే ఓట్లు ఖచ్చితంగా పిడిఎఫ్ అభ్యర్థులకే ఓట్లేస్తారని 'అధికార' పార్టీ కావాలనే తిప్పిపంపుతున్నట్లు సమాచారం. దీంతో గంటలు గంటలు నిరీక్షించలేక పట్టభద్రులు కొంతమంది అనాసక్తి చూపుతున్నారు. మరికొంతమంది వారి ఇళ్లవద్దనే సొంత ఫోన్లలో అప్‌లోడ్ చేసుకుంటున్నారు. ఏది ఏమైనా గత ఎన్నికలతో పోలిస్తే ఓట్ల చేర్పింపు మందగమనంగానే సాగుతుందని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే ఈ రెండు రోజుల్లో అధికార పార్టీ 'గుత్త'గా దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే ప్రయత్నాల్లో ఉంది.

శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

7న యాగంటిలో కార్తీక దీపోత్సవం

డయల్ యువర్ ఈవోలో టిటిడి ఈవో

ప్రజాశక్తి- తిరుమల:

తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరుగనున్నాయని, ఇందుకు విస్తతంగా ఏర్పాట్లు చేపడుతున్నామని టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో టిటిడి చేపట్టిన పలు కార్యక్రమాల గురించి భక్తులకు వివరించారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ప్రధానంగా నవంబరు 24న గజవాహనం, 25న గరుడవాహనం, 27న రథోత్సవం, 28న పంచమితీర్థం, 29న పుష్పయాగం జరుగనున్నాయని తెలిపారు. పంచమితీర్థానికి లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో ఇందుకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేపడుతున్నామన్నారు.

సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లు

తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం కాంప్లెక్స్, గోవిందరాజస్వామి సత్రాల వద్ద నవంబరు 1 నుండి ప్రయోగాత్మకంగా సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్ల జారీని ప్రారంభించామన్నారు. శని, ఆది, సోమవారాల్లో 25వేల టోకెన్లు, మిగతా రోజుల్లో రోజుకు 15 వేల టోకెన్లు జారీ చేస్తున్నాం. నిర్దేశిత కోటా పూర్తవగానే కౌంటర్లు మూసివేస్తున్నామని అన్నారు. టోకెన్ లభించిన భక్తుడు అదేరోజు దర్శనం చేసుకోవచ్చు అని, టోకెన్లు లేని భక్తులు నేరుగా తిరుమల చేరుకుని వైకుంఠం క్యూ కాంప్లెక్స్-2 ద్వారా స్వామివారిని దర్శించుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. టోకెన్ పొందిన భక్తులు తమకు కేటాయించిన సమయంలోనే దర్శన క్యూలైన్లలోనికి రావాల్సిందిగా కోరారు.



డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో మాట్లాడుతున్న ధర్మారెడ్డి

డిసెంబరు 1 నుండి బ్రేక్ దర్శన సమయం మార్పు

శ్రీవారి దర్శనార్థం కంపార్ట్‌మెంట్లలో రాత్రివేళ వేచి ఉండే సామాన్య భక్తులకు ఉదయం త్వరగా దర్శనం కల్పించేందుకు వీలుగా డిసెంబరు 1వ తేదీ నుండి విఐపి బ్రేక్ దర్శన సమయాన్ని ఉదయం 8 గంటలకు మార్పు చేసి ఒకనెల పాటు ప్రయోగాత్మకంగా అమలుచేస్తామన్నారు. భక్తుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఆ తరువాత తగిన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

నవంబరు 8న చంద్రగ్రహణం

8న మంగళవారం చంద్రగ్రహణం కారణంగా ఉదయం 8.40 నుండి రాత్రి 7.20 గంటలకు శ్రీవారి ఆలయ తలుపులు మూసి ఉంచడం జరుగుతుందన్నారు. ఈ కారణంగా బ్రేక్ దర్శనంతోపాటు శ్రీవాణి, రూ.300లు ప్రత్యేక ప్రవేశదర్శనం తదితర ప్రత్యేక దర్శనాలు, ఆర్జితసేవలను రద్దు చేశామని, ఆలయం తెరిచిన తరువాత సర్వదర్శనం భక్తులను మాత్రమే అనుమతిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెఈవో సదాభార్గవి, సివిఎస్వో నరసింహ కిషోర్, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్ కుమార్, చీఫ్‌ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఇ-2 జగదీశ్వర్‌రెడ్డి, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీదేవి, ఎస్టేట్ ప్రత్యేకాధికారి మల్లికార్జున పాల్గొన్నారు.

ఎస్వీయూలో దళితుల ఆత్మీయ సభ



ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని శ్రీనివాస ఆడిటోరియంలో శనివారం దళిత ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి సాంఘిక సంక్షేమచులు మెరుగు నాగార్జున, క్రీడా శాఖ మంత్రి ఆర్కెరోజా, ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, ఎమ్మెల్యే ఆదిమూలం, ఎమ్మెల్యే వరప్రసాద్ తదితరులు విచ్చేసి అంబేద్కర్ విగ్రహమునకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి శ్రీనివాస ఆడిటోరియం వరకు ప్రదర్శనగా వచ్చి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభాధ్యక్షులుగా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి నిర్వహించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే సమన్యాయం పాటిస్తున్నారని 5 మంది దళితులను మంత్రులను చేసిన ఘనత ముఖ్యమంత్రి దాని కొనియాడారు. సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున మాట్లాడుతూ అన్నదమ్ములుగా ఉండే మాల మాదిగలను విడదీసిన నీచచరిత్ర చంద్రబాబుదని దుయ్యబట్టారు. ఎవరన్నా దళితులుగా పుట్టాలా అనే అనుకుంటారా అని అనడం దళితులను అవమానించడం కాదా అని నిలదీశారు. దళితులకి అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు క్రిస్టియన్ జేఏసీ చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్, మల్లారపు మధు, ఎంపీఎస్ మనీ, తలారి రాజేంద్ర, రాజేష్, కుసుమ కుమారి, ఎంపీ దేవదానం, కేశవులు పాల్గొన్నారు.

నిర్దిష్ట సమయంలో నీటిసరఫరా చేయండి

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: నగరంలో నిర్దిష్ట సమయంలోనే తాగునీరు సరఫరా చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. నగరంలోని 26 వార్డులోని సున్నపువీధి, బండ్లవీధి, తిలక్ రోడ్డు, తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శనివారం కమిషనర్ తనిఖీ చేశారు. ప్రతిరోజు పారిశుద్ధ్య సిబ్బంది చెత్త సేకరణకు వస్తున్నారా..? తాగునీరు వస్తున్నాయా..? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య సిబ్బంది వస్తున్నారని, నీరు సరైన సమయంలో సరఫరా చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ ఇకపై అన్ని ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో నిర్దిష్టమైన సమయంలో నీటిసరఫరా అయ్యేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే డ్రైనేజీ కాలువల్లో ఎక్కడా కూడా చెత్త నిలువ చేరకుండా శుభ్రం చేయాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు ఎవ్వరూ కూడా కాలువల్లో చెత్త పడేయరాదని, తమ సిబ్బందికి తడి, పొడి చెత్తవేరుగా అందించాలన్నారు. కాగా సున్నపువీధిలో బోరు, బండ్లవీధి నాలుగుకాళ్ల మండపం నుంచి గ్రూప్ థియేటర్ వరకు సీసీ రోడ్డు అవసరం ఉందని వైసిపి నాయకులు ఉదయ్ వంశీ కమీషనర్ దష్టికి తీసుకెళ్లగా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కమిషనర్ వెంట ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ హరికష్ణ, శానిటరి సూపర్వైజర్ సుమతి, శానిటరి, అమెనిటీ సెక్రటరీలు ఉన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

మాతృత్వ చిలడ్రన్స్ ఆసుపత్రిని సందర్శించిన మంత్రి పెద్దిరెడ్డి

ప్రజాశక్తి- తిరుపతిసిటీ: ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్రెడ్డి వందలాది జబ్బులను ఆరోగ్యశ్రీలో చేర్చి మెరుగైన వైద్యం అందిస్తున్నారని రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక ఎంఆర్‌పల్లి సర్కిల్ వద్ద నూతనంగా ప్రారంభించిన మాతృత్వ చిలడ్రన్స్ స్పెషాలిటీ ఆసుపత్రిని శనివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సందర్శించారు. చిన్నపిల్లలకు అందించే వైద్యసేవలను ఆ ఆసుపత్రి డాక్టర్ ఎస్. మాధవి ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని పరికరాలను పరిశీలించారు. అనంతరం ఆసుపత్రిలో మంత్రి పెద్దిరెడ్డి బీపీ చెక్ చేసుకున్నారు. చెన్నై తరహాలో తిరుపతి ఆధ్యాత్మిక నగరంలో మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులు ఎన్నో తీసుకొచ్చారని తెలిపారు. సామాన్య, మధ్యతరగతి వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు. తిరుపతి ఆర్డీవో కనక నరసారెడ్డి, రేణిగుంట తహశీల్దార్ ఎశివప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్లు ప్రేమ్‌కుమార్, రూప్చంద్, పార్టీ సీనియర్ నాయకులు, విరుపాక్షి జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.



శ్రీవారి ఆలయంలో వేడుకగా కైశికద్వాదశి ఆస్థానం

మాడ వీధుల్లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తి దర్శనం



ప్రజాశక్తి- తిరుమల: కైశిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవారి ఆలయంలో శనివారం కైశిక ద్వాదశి ఆస్థానం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయం 4.30 నుండి 5.30 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఉగ్ర శ్రీనివాసమూర్తిని ఆలయ మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధులలో ఊరేగిస్తారు. అనంతరం ఉదయం 5.30 నుండి ఉదయం 7 గంటల వరకు స్వామి, అమ్మవార్లను బంగారువాకిలి చెంత వేంచేపు చేసి అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కైశిక ద్వాదశి ప్రత్యేకతను సంతరించుకుంది. ఉత్థానద్వాదశికి కైశికద్వాదశి అంటారు. ఈకార్యక్రమంలో పెద్ద జీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, ఈవో ఎవి.ధర్మారెడ్డి, ఆలయ డెప్యూటీ ఈవో రమేష్ బాబు, విజివో బాలిరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాయిసుధా హాస్పిటల్ ఆధ్వర్యంలో..

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: ఆరోగ్య పరిరక్షణ 40సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఎముకల సాంద్రత పరీక్షలను విధిగా చేసుకోవాలని అప్పుడే కీళ్ల నొప్పులు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, వంటి ఎముకలకు సంబంధించిన వ్యాధులను నియంత్రించవచ్చునని ప్రముఖ ఆర్థో వైద్యనిపుణులు సాయిసుధా మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి అధినేత డాక్టర్ సుకుమార్ పేర్కొన్నారు. శ్రీసాయిసుధా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్స్ వారి తుమ్మలగుంట నలందనగర్‌లోని ఫిజియోథెరపీ ఫిట్నెస్ సెంటర్, కంటివిభాగం ఆధ్వర్యంలో ఉచిత ఎముకల సాంద్రత పరీక్షల వైద్యశిబిరాన్ని శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎముకల సాంద్రత వాటి పటిష్టత పరీక్షలను ఉచితంగా నిర్వహించి, తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి తెలియజేశారు. మనిషిలో క్యాల్షియం తగినపుడు ఈ ఎముకల అరుగుదల పటుత్వం తగ్గుతుందని తెలిపారు. దీని కారణంగా కాళ్లనొప్పులు, కీళ్లవాపులు, మణికట్టు వాపులు, నడుము నొప్పులు, తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. దీనిని గుర్తించి 40 ఏళ్ల పైబడిన ప్రతివ్యక్తి విధిగా ఎముకల సాంద్రత పట్టుత్వ పరీక్షలను చేసుకోవాలని సూచించారు. వయసు పెరుగుతున్న కొద్దీ ఆరోగ్య పరిరక్షణ పట్ల మరింత శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ప్రతిఒక్కరూ పాటించాలన్నారు. ఈ ఉచిత వైద్యశిబిరంలో సుమారు 100 మందికి పైగా వైద్యపరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా 50 మందికి పైగా కంటికి సంబంధించిన వ్యాధులకు డాక్టర్ సుధారాణి కంటి పరీక్షలు చేసి 6మందికి ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఉచిత శుక్లాల ఆపరేషన్‌కి సాయిసుధా హాస్పిటల్‌కి రెఫర్ చేయడం జరిగింది. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ హిమబిందు, ఫిజియోథెరపిస్టులు సునీత, కీర్తి, పుష్ప, రమణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో సేవలు అందిస్తున్న డాక్టర్ సుధారాణి

ఏహెచ్ దారిలో వ్యర్థాలకు అడ్డుకట్టవేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లే దారిలో వ్యర్థాలు పడేయకుండా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఎం, సీపీఐ, నాయకులు కోరారు. శనివారం వారు మున్సిపల్ కమిషనర్ బాలాజీ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకుడు అంగేరి పుల్లయ్య, సిపిఐ నాయకులు జనమాల గురవయ్య మాట్లాడుతూ పట్టణంలోని కొందరు మాంసాహార దుకాణదారులు వ్యర్థాలను ఏరియా ఆసుపత్రికి వెళ్లే దారి పక్కన పడేస్తున్నారనీ, ఫలితంగా దుర్గంధం ఏర్పడుతోందని వాపోయారు. ఇదే మార్గంలో పలు ప్రభుత్వ కార్యాలయాలకు, విద్యాలయాలకు అధికారులు, విద్యార్థులు, ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారనీ, ఈ క్రమంలో మాంసం వ్యర్థాల నుంచి వస్తున్న దుర్గంధం వల్ల రోగాల బారిన పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు ఏరియా ఆసుపత్రి దారిలో వ్యర్థాలు పడేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గంధం మణి తదితరులు పాల్గొన్నారు.




14వ రిలయన్స్ ఫ్యాషన్ ఫ్యాక్టరీ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

భారతదేశపు అతిపెద్ద రిటైలర్ రిలయన్స్ రిటైల్ తన సరికొత్త ఫ్యాషన్ స్టోర్ ఫార్మాట్ - ఫ్యాషన్ ఫ్యాక్టరీని తిరుపతిలో ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. 14 ఫ్యాషన్ ఫ్యాక్టరీ స్టోర్ అన్నమయ్య సర్కిల్ సమీపంలో ప్రారంభమైంది. ఇది ఒక షాపర్స్ హబ్‌గా ఆదర్శవంతమైన గమ్యస్థానం. ఫ్యాషన్ ఫ్యాక్టరీ గొప్ప ధరలకు అంతర్జాతీయ, జాతీయ ఫ్యాషన్ బ్రాండ్లతో కూడిన భిన్నమైన అసార్ట్‌మెంట్. ఇది దేశంలో ప్రత్యేక స్థానం పొందింది. ఒకే చోట అన్ని ఫ్యాషన్ అవసరాలను తీర్చడం ద్వారా, ఇది 'బ్రాండ్స్ ఫర్ లెస్'ను అందించే వన్‌స్టాప్ షాపింగ్ గమ్యస్థానంగా ఉంటుంది. 365 రోజులూ ఫ్యాషన్ ను అదిస్తూ. 20శాతం నుంచి 70శాతం వరకు రాయితీలతో అత్యుత్తమ బ్రాండ్లు ఇక్కడ ఉంటాయి. తిరుపతిలోని వినియోగదారులు ఇప్పుడు అంతర్జాతీయ ఫ్యాషన్ పోకడలను కొనసాగించడానికి ఎదురుచూస్తున్నారు. వీటిలో లెవిస్, పెపె, క్రోకడైల్, స్పైకర్, స్కెచర్స్, ప్యూమా, క్రోక్స్, లీకూపర్, బఫెలో, విశుద్ధ్, హూర్, పార్క్ అవెన్యూ, సష్టి, వీఐపీ, స్కైబ్యాగ్స్, జాన్ ప్లేయర్స్, పీటర్ ఇంగ్లాండ్, రేమండ్స్.. ఇంకా మరెన్నో ఉన్నాయి. మొత్తం కుటుంబానికి 20,000కుపైగా శైలుల ఎంపికలుంటాయి. వాటిలో రోజువారీ వేసుకునే దుస్తుల నుంచి పార్టీలు, పండుగలు, పెళ్లిళ్ల వరకు ప్రతిసందర్భానికీ తగినట్లుగా దుస్తులు అందిస్తుంది. తిరుపతిలోని ఈ కొత్త మల్టీ బ్రాండ్ ఫ్యాషన్ స్టోరులో అగ్రశ్రేణి ఇంటర్నేషనల్, నేషనల్ బ్రాండ్ల మీద ఫ్లాట్ 60శాతం ఆఫ్ ప్రత్యేక ఆఫర్ కూడా ఉంది. ఇది షాపింగ్‌ను మరింత ఆకర్షణీయంగా తయారు చేస్తుంది.



అమ్మవారి సేవలో డీజీవీఎస్ కౌముది



ప్రజాశక్తి - తిరుచానూరు: తమిళనాడు ఇంటలిజెన్స్ డీజీవీఎస్ కౌముది శనివారం తిరుచానూరులోని అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ మధుసూదన్, ఆగమ సలహాదారు శ్రీనివాసాచార్యులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. దర్శనానంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఏఈవో ప్రభాకర్‌రెడ్డి, ఏవీఎస్‌వో శైలేంద్రబాబు, తిరుచానూరు సీఐ సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎస్సై వెంకటసుబ్బయ్య, రామ్మోహన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, దామోదర్, అశోక్, ఆలయ అర్చకులు బాబుస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పోలీసులకు విద్యార్థుల వినతి



ప్రజాశక్తి - నాయుడుపేట: అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నాయుడుపేట సీఐ ప్రభాకర్ రావుకు పలు సమస్యలపై విద్యార్థులు శనివారం వినతిపత్రం అందించారు. నాయుడుపేటలో కళాశాలలు, పాఠశాలల వద్ద విచ్చలవిడిగా డ్రైవింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వారిని వెంటనే శిక్షించాలని కోరారు. నగర కార్యదర్శి తడుకు చందు, లక్ష్మీనారాయణ, హరి నారాయణ, శివారెడ్డి, గౌతమ్, ఉదయ్, చేతన్, అబ్బాస్ పాల్గొన్నారు.

రైతులకు నేరుగా గ్రామాల్లోనే సబ్సిడీలు

ప్రజాశక్తి -తొట్టంబేడు: మండలంలోని బసవయ్యపాలెం సచివాలయ పరిధిలోని ఆర్బీకేను తమిళనాడు రాష్ట్రం సహకార సంఘం బ్యాంక్ అడిషనల్ రిజిస్టర్ ఎం.మురుగన్, జాయింట్ రిజిస్టర్ కేసీ రవిచంద్రన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అమలు చేసిన సచివాలయాల్లో ఆర్బీకే పనితీరు ఎలా ఉందని తెలుసుకోవడానికి వచ్చామన్నారు. రైతులకు నేరుగా సబ్సిడీలు గ్రామంలోనే అందించవచ్చునన్నారు. తిరుపతి సహకార సంఘం డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ రవిబాబు, సహాయ రిజిస్టర్లు మధు పెంచలయ్య, శివశంకర్, తంగేళ్లపాలెం సింగల్ విండో అధ్యక్షులు మోహన్ కిషోర్ నాయుడు, సీఈవో చిరంజీవి రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ గీత తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతే ఆయుధం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అనుకోని ప్రమాదాలు ఎదురైనప్పుడు అప్రమత్తతే విద్యార్థినుల పట్ల ఆయుధంగా మారుతుందని శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి తెలిపారు. మత్తు పదార్థాలు-విద్యార్థినుల అక్రమ రవాణాపై స్థానిక ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాలలో న్యాయ సలహా మండలి ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జ్ బేబీ రాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థినులు మానవ విధులు, హక్కులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిసరప్రాంతాలను గమనిస్తూ అనుమానాస్పద వ్యక్తులపై సందేహం ఉంటే మీ టీచర్లకు, పోలీసులకు, లేకుంటే పారా లీగల్ వాలంటీర్ల ద్వారా తమకు తెలియజేయాలని సూచించారు. వన్ టౌన్ సిఐ అంజూ యాదవ్, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ప్రతిఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పుత్తూరు ఇన్‌ఛార్జి సీనియర్, మండల న్యాయసేవా సంస్థ అధ్యక్షులు శిరీష్ ఆదేశాల మేరకు కేబీఆర్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయసేవా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించారు. కేకేసీ న్యాయ కళాశాల విద్యార్థి రవివర్మ విద్యార్థులకు బాలకార్మిక, బాల్య వివాహాల నిరోధక చట్టాలపై వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు సుజన కుమారి, మోహన్ రాజు, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు



ప్రజాశక్తి-గూడూరు రూరల్: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు సరఫరా చేసినా.. విక్రయించినా వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు పురపాలక సంఘ కమిషనర్ సాయినాథ్ హెచ్చరించారు. శనివారం గూడూరు పట్టణంలోని నారాయణమ్మ వీధిలో దుకాణాలను మున్సిపల్ కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓ దుకాణంలో నిల్వ ఉన్న ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు స్వాధీనం చేసుకున్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లు ప్రభుత్వం నిషేధించిందని.. వ్యాపారులు విక్రయాలు చేయరాదని సూచించారు.

రాచపాళెంలో పాఠశాల ఏర్పాటు చేయాలి



ప్రజాశక్తి -సత్యవేడు: చిత్తూరులో శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సత్యవేడు జడ్పీటీసీ సభ్యులు విజయలక్ష్మి చంద్రశేఖర్‌రెడ్డి పలు సమస్యలను ప్రస్తావించారు. ప్రధానంగా సత్యవేడు మండలం రాచపాలెం గ్రామంలో ఉన్న ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు.. వసతులు లేక అవస్థలు పడుతున్నారని.. రాచపాళెం గ్రామంలో నూతనంగా పాఠశాల ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి డీఈవోను ఆదేశించినట్లు జడ్పీటీసీ తెలిపారు.

ఎన్జీవో సంఘం అధ్యక్షులుగా లలిత్ కుమార్



ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు తాలూకా ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షులుగా బొప్పన లలిత్ కుమార్ ఎన్నికయ్యారు. శనివారం స్థానిక ఎన్జీవో భవనంలో ఎన్నికల అధికారి గిరిప్రసాద్ అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్జీవో సంఘం కార్యదర్శిగా లీలా మాధవరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ గా హిమబిందు, ఉపాధ్యక్షులుగా మధుసూదన్ శర్మ, ఉమాదేవి, హేమభూషణం, కార్యదర్శులుగా వాసు, ప్రవీణ్, తంగరాజులు, మహిళా సంయుక్త కార్యదర్శిగా స్వర్ణ, కోశాధికారిగా ఓం ప్రసాద్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఎన్నికైన ఏపీ ఎన్జీవో కార్యవర్గ సభ్యులతో జిల్లా నాయకులు పదవీ ప్రమాణం చేయించారు. ఏపీ ఎన్జీవో జిల్లా కార్యదర్శి రఘు, శ్రీకాళహస్తి ఎన్నికల అధికారి నాగరాజు, పలువురు ఏపీ ఎన్జీవో సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు మాటలు బీసీలు వినరు

ప్రజాశక్తి- తిరుపతి(మంగళం): మాజీముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాటలు ఇక బీసీలు వినే పరిస్థితి లేదని.. వైఎస్ఆర్ అభిమాని బొమ్మగుంట రవి స్పష్టం చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలు జడ్జీలుగా పనికిరారని కేంద్ర ప్రభుత్వానికి చెప్పిన వ్యక్తి నేడు టీడీపీ పార్టీకి బీసీలే వెన్నుముక అని ఎలా అబద్దాలను చెబుతారని ప్రశ్నించారు. బీసీల అభ్యున్నతికి కృషిచేసిన ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎప్పటికీ బీసీల మనసుల్లో ఉండిపోతారన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో వైఎస్పీ అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, టీడీపీ తుడిచిపెట్టుకుపోతుందన్నారు. కార్యక్రమంలో సోము, కన్నయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రహదారులు బురదమయం

- చెరువులను తలపిస్తున్న వీధులు
- డ్రైనేజీ లేక నిలిచిపోతున్న నీరు
- అవస్థల్లో ప్రజలు
- పట్టించుకోని అధికారులు



బురదమయంగా ఉన్న తహశీల్దార్ కార్యాలయం



ప్రజాశక్తి -బాలాయపల్లి : తుఫాను ప్రభావంతో కురిసిన తేలికపాటి వర్షానికి తహశీల్దారు కార్యాలయం రోడ్డ బురదమయమైంది. దీంతో వివిధ పనుల కోసం కార్యాలయానికి చేరుకునే పాదచారులు నడిచేందుకు అవస్థలు పడుతున్నారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు తహశీల్దారు కార్యాలయంలో పనిచేసే సిబ్బంది ప్రజలు బయటికి రావాలన్నా బురదలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొంది.

కార్యాలయానికి వచ్చే ద్విచక్ర వాహనాలు కూడా ఎక్కడ క్రింద పడిపోతామో అని జంకుతున్నారు. పాదచారులు కూడ బురదలో అడుగు వేసి అడుగు వేయాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షం నీళు నిలవడంతో దోమలు అధికంగా ఉంటున్నాయి.ఇక తహసీల్దారు కార్యాలయం చుట్టూ పిచ్చి చెట్లు రావాలంటే చాల ఇబ్బందికరంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. సిమెంటు రోడ్లు వేస్తే కొద్ది మేరకైనా ప్రజలకు ఉపశమనం కలుగుతుందని అంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లు వేయించాలని కోరుతున్నారు.

అడుగు పెడితే జారుతుంది



తహశీల్దార్ కార్యాలయంకి రావాలంటే కాలు జారితే ప్రమాదానికి గురవుతావనిభయమేస్తుంది. చిన్నపాటి వర్షం వచ్చిన బురదగా ఉంటుంది. **- కిటుకు రమణారెడ్డి మన్నారు, బాలాయపల్లి మండలం**

పట్టించుకునేవారు లేరా?



తహశీల్దార్ కార్యాలయానికి వస్తే దోమలు, బురద తొక్కందే కార్యాలయం లోకి అడుగు పెట్టలేకపోతున్నాం. అధికారులు ఉన్నట్టా లేనట్టా.. ప్రజా ప్రతినిధులు అయినా పట్టించుకుని సీసీ రోడ్ ఏర్పాటు చేయాలి.

- చిన్నయ్య అలిమిలి బాలాయపల్లి మండలం

బిఎన్‌కండ్రిగలో..



మండలంలోని తలారివెట్టు దళితవాడలో చిన్నపాటి వర్షాలకు వీధులు జలమయమవుతూ, చెరువులు, గుంతలను తలపిస్తున్నాయి. ఈ సమస్యలపై ఇక్కడ రాజకీయపార్టీ నాయకులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటం బాధాకరమని ప్రజలు వాపోతున్నారు. ఊర్లో వాలంటీర్లు వ్యవస్థ ఉన్నా కూడా ఈ సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేయడం లేదన్నారు. పంచాయితీ అధికారులు స్పందించి తమ గ్రామానికి డ్రైనేజీ కాల్వలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతి సంవత్సరం ఇంటి పన్ను పేరుతో డ్రైనేజీకి, లైబ్రరీకి, పన్నులు వసూలుచేస్తున్నారు. అయినా ఇంటిపన్నుతో కలిపి అన్నీ పన్నులు కడుతున్నా తమ పంచాయతీ అభివృద్ధి చెందడంలేదని ఈ విషయంపై పలుమార్లు విన్నవించుకున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఇకనైనా ఈ సమస్యపై స్పందించి తక్షణ పరిష్కారం చెయ్యాలని, లేకుంటే పన్నులు పేరుతో వసూలు చేస్తున్న పంచాయతీ డబ్బులను ఇచ్చేయాలని డిమాండ్ చేశారు.

అసర్ సర్వేను విజయవంతం చేయండి

డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు



ప్రజాశక్తి- వెంకటగిరి: విద్య స్థితిగతులను అధ్యయనం చేసేందుకు జాతీయస్థాయిలో నిర్వహిస్తున్న అసర్ సర్వేను జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు కోరారు. అసర్ - 2022 (యాన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్ రిపోర్ట్) సర్వేలో పాల్గొంటున్న నెల్లూరు జిల్లా ఛాత్రోపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం పల్లెపాడు డైట్ కళాశాలలో జరుగుతోంది. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపల్ మాట్లాడుతూ శిక్షణ సందర్భంగా తెలుసుకున్న అంశాల ఆధారంగా సర్వేను శాస్త్రీయంగా నిర్వహించాలని సూచించారు. సరైన గణాంకాలను నమోదుచేయాలని సర్వే నాణ్యత విషయంలో శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అసర్ మేనేజర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ అసర్-2022 సర్వేలో భాగంగా ఆది, సోమవారాలలో ఉమ్మడి నెల్లూరు జిల్లాకు సంబంధించి 24 మండలాల్లో ముప్పై గ్రామాల్లో 60 మంది వాలంటీర్లతో రెండు రోజులపాటు సర్వే జరుగుతుందని తెలిపారు. సర్వేలో సేకరించిన సమాచారాన్ని న్యూఢిల్లీలోని ప్రథమ్ సంస్థకు అందజేస్తామని తెలిపారు. మాస్టర్ ట్రైనర్ చెంచయ్య యాదవ్ సర్వేకు సంబంధించిన వివిధ అంశాలపై సర్వేలో పాల్గొంటున్న వలంటీర్లకు అవగాహన కల్పించారు. అనంతరం సర్వేలో పాల్గొంటున్న వాలంటీర్లకు సర్వేకిట్లను డైట్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో డైట్ గణిత సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఆర్. బాలాజీరావు, డైట్ ఉపన్యాసకులు పి. అల్తాఫ్, ఎస్కే జులేఖాబీ, బి. దశరథరామిరెడ్డి, ఎస్. బోయ దాస్, కె. విజయచంద్ర, ఎస్. నరసింహామూర్తి, డి. నర్సింగరావు, సోమేశ్వర్, ఎస్. శివలు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా సర్కారు బడులు

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



ప్రజాశక్తి-దొరవారిసత్రం: ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదేనని సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే, తిరుపతి తిరుమల దేవస్థానం బోర్డు సభ్యులు కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం దొరవారిసత్రం మండల పరిధిలోని శ్రీ ధనమల్లి గ్రామ పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంజూరైన నాడు-నేడు నిధులతో అదనపు గదుల నిర్మాణాలకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యపై ప్రత్యేక దష్టి పెట్టి రాష్ట్రంలో ఉన్న ప్రతి పాఠశాల అభివద్ధికి కృషి చేస్తున్నారని..శ్రీధనమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అదనపు గదులు, ప్రహరీ నిర్మాణాలకు రూ.1.71 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. పేద విద్యార్థికి అందుబాటులో ఉండేలా ప్రతి పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం విద్యను ప్రవేశపెట్టారని తెలిపారు. దేశంలోనే మన రాష్ట్రం విద్యలో రెండో స్థానంలో ఉందని.. త్వరలోనే కేరళ రాష్ట్రాన్ని మించిపోయి మొదటి స్థానంలోకి వస్తుందని తెలిపారు. సూళ్లూరుపేట చెంగాలమ్మ ట్రస్టు బోర్డు ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, జడ్పీటీసీ రమేష్, దొరవారిసత్రం మండల వైసీపీ అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, వైసీపీ మండల నాయకులు ఓడూరు రమణారెడ్డి, సురేష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బాబు రెడ్డి, ప్రసాద్‌నాయుడు, ఎంపీడీవో సింగయ్య, ఎంఈవో మస్తానయ్య, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సోమయ్య, ఎస్సై తిరుమలరావు, ప్రధానోపాధ్యాయులు మస్తానయ్య, ఎస్ఎంసీ కమిటీ ఛైర్మన్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అన్నమాచార్యలో క్యాట్యా సాఫ్ట్‌వేర్‌పై శిక్షణ



శిక్షకులకు జ్ఞాపికను అందిస్తున్న ప్రిన్సిపల్ నాధమునిరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి-కరకంబాడి మార్గంలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల (అటానామస్)లో మెకానిక్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థులకు సీఏటీఐఏ సాఫ్ట్‌వేర్ పై వారం రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, దస్సాల్ట్స్ సిస్టమ్స్ ఆధ్వర్యంలో శిక్షకులు రుకేష్‌రెడ్డి, సుమోహన క్యాట్యా సాఫ్ట్వేర్‌పై శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాధముని రెడ్డి మాట్లాడుతూ క్యాట్యా సాఫ్ట్వేర్ ముఖ్య ఉపయోగాలను, ఉద్యోగ అవకాశాలను విద్యార్థులకు వివరించారు. మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి ఎం. బాలాజీ, కె. కుమార్, డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ చైతన్య రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వారి విద్యా నైపుణ్యాలను మెరుగు పరుచుకునేందుకు భవిష్యత్తులో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామని, ఇటువంటి శిక్షణ కార్యక్రమాలను విద్యార్థులు క్రమంగా అందుపుచ్చుకొని రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ గంగిరెడ్డి శిక్షణ అందించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పద్మావతి డిగ్రీ కాలేజీలో శిక్షణ తరగతుల ప్రారంభం



ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో శ్రీ పద్మావతి డిగ్రీ, పీజీ కాలేజీలో డిగ్రీ సెకండ్ ఇయర్ స్టూడెంట్స్‌కి 5 వారాలు ఇంటర్న్‌షిప్ శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాళ్లు డాక్టర్ మహదేవమ్మ, డాక్టర్ ఉమాదేవి మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా డిగ్రీ రెండో సంవత్సర విద్యార్థులకు శిక్షణ తరగతులు తప్పనిసరన్నారు. కౌటిల్య అకాడమీ డైరెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో స్థిరపడాలంటే పట్టుదల.. కృషి ఉండాలని.. ఎంచుకున్న రంగంలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కౌటిల్య ఇన్‌స్టిట్యూట్ కంపెనీ ప్రతినిధులు, సీనియర్ మేనేజర్ ఎన్.ఎస్.రెడ్డి, కోఆర్డినేటర్లు సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ప్రజాశక్తి-ఓజిలి: మండలంలోని సగుటూరు పంచాయతీ వడ్డీపాలెం చెరువులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో రజినీకాంత్ శనివారం పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి హామీలో ప్రతి కుటుంబానికీ వంద రోజులు పని దినాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పనుల్లో ప్రతి కూలీ గరిష్ట వేతనాలు పొందేలా చర్యలు చేపట్టాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. హాజరు పట్టికలో నమోదైన పేర్లను పరిశీలించారు. ఉపాధి హామీలో విధులు నిర్వహిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపమని కోరారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఇన్‌ఛార్జి ఏపీవో మహేష్ , వైస్ ఎంపీపీ ప్రసాద్ నాయుడు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



ఉచిత పశువైద్యశిబిరం

ప్రజాశక్తి- కేవీబీపురం: మండలంలోని మోరీస్‌కండ్రిగ గ్రామంలో రిలయన్స్ ఫౌండషన్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 86 ఆవులు, 123 మేకలు, 112 గొర్రెలకు చికిత్సలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి పార్థీబన్, రిలయన్స్ ఫౌండేషన్ సిబ్బంది వరయ్య పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: హెల్మెట్ వాడటం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు పోకుండా రక్షించుకోవచ్చని శ్రీకాళహస్తి డిఎస్పి విశ్వనాధ్ విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని స్థానిక విక్రమ్ డిగ్రీ కళాశాలలో శ్రీకాళహస్తి ట్రాఫిక్ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో హెల్మెట్ వాడకంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ వాడకపోవడం వల్ల కలిగే నష్టాలను, వాడితే కలిగే ప్రయోజనాలను సందర్భంగా డిఎస్పీ విద్యార్థులకు వివరించారు. ఎంవీఐ దామోదర్ నాయుడు, ట్రాఫిక్ ఏఎస్ఐ రియాజ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి -తొట్టంబేడు: మండలంలోని పొయ్యి పంచాయతీ రామానాయుడు గిరిజన కాలనీలో ఓం శ్రీ సత్య సాయి అన్న ప్రసాద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం 50 మందికి దుప్పట్లు, దుస్తులు, ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. మండలాధ్యక్షులు వాసుదేవనాయుడు, ట్రస్ట్ కన్వీనర్ పాండురంగయ్య, చెంగయ్య , రవిబాబు, రాంబతి రెడ్డి, వాసుదేవరావు, అన్వర్, మురళీ, లలితమ్మ, మల్లేశ్వరి, లలిని, చెంచులక్ష్మి, సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

11న క్రీడాపోటీలు

ప్రజాశక్తి- బీఎన్‌కండ్రిగ : సత్యవేడు నియోజకవర్గం క్రీడా పోటీలను ఈనెల 11వ తేదీన నిర్వహించనున్నట్లు పీఈటీ కిషోర్‌కుమార్ తెలిపారు. శాసన సభ్యులు కోనేటి ఆదిమూలం ఆధ్వర్యంలో సీఎం కప్ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు.18 ఏళ్లకు పైబడిన యువతీ యువకులు ఈ క్రీడా పోటీల్లో పాల్గొనవచ్చున్నారు. వివరాలకు ఫోన్‌నంబరు 8121081089 ను సంప్రదించాలని కోరారు.

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు



ప్రజాశక్తి-గూడూరు: ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే వరప్రసాదరావు ఆర్డీవో కిరణ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆర్డీవో పేర్కొన్నారు.

పాము పట్టివేత

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక రామారావు కాలనీ 15 వార్డులో 6 అడుగుల జెరిపోతు పాము హల్‌చల్ చేసింది. సమాచారం అందుకున్న స్నేక్ స్నాచర్ శ్రీకాంత్ అక్కడకు చేరుకుని సురక్షితంగా పట్టుకొని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.

రేణిగుంటలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-రేణిగుంట : పట్టణంలోని మాతమ్మ గుడి, రాముల వారి గుడి తదితర ప్రాంతాల్లో శనివారం పంచాయతీ సర్పంచ్ నగేష్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువలను శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించారు. పంచాయతీ కార్యదర్శి విజయభాస్కర్ పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణ పనులకు శ్రీకారం



ప్రజాశక్తి - నాయుడుపేట: రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రోడ్ల విస్తరణ, అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా విశాఖపట్నం - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధిలో భాగంగా ఏడీబీ ఆర్థిక సహాయంతో తిమ్మాజికండ్రిగ- కొత్తపేట- పాండ్లూర్ రైల్వే గేట్ మీదుగా తిమ్మాజికండ్రిగ నుంచి హైవే నాయుడుపేట వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు అధికారులు పర్యవేక్షించారు. కొత్తపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ శేషమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భూ నిర్వాసితులకు, ఇళ్లు కోల్పోయే వారికి భూ సేకరణ, పునరావాస పునర్నిర్మాణం ప్యాకేజీపై రైజస్ సామాజిక నిపుణుడు పి. దేవరాజు క్లుప్తంగా తెలియజేశారు. ప్రజల అభిప్రాయాలను, సలహాలను తెలుసు కున్నారు. ఏఈఈ చిన్నరాయుడు, రైజస్ సిబ్బంది రామ్మోహన్, మునిరామయ్య, నాగరాజు, పి.హరిరెడ్డి, నాయకులు, గ్రామ పెద్దలు, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి- సత్యవేడు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని దాసుకుప్పం పీహెచ్‌సీ వైద్యులు మురళీకష్ణ అన్నారు. శనివారం ఆయన గంగమెట్ట కాలనీలో వైద్యసేవలు అందించారు. ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం మాస్టర్ స్కూల్ ప్రాంగణంలో రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో వైద్య పర్యవేక్షకులు కష్ణయ్య, ఎంఎల్ హెచ్‌పి మేఘన, షణ్ముఖనాథ్, ఆరోగ్య కార్యకర్తలు ద్రాక్షాయణి, వెంకటలక్ష్మి, 104 డీఈవో జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: మండల పరిధిలోని ఏ కొల్లు గ్రామంలో శనివారం డాక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు షుగర్, బీపీ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించి సూచనలు చేశారు. 104 వైద్యాధికారి కిషోర్, హెల్త్ సూపర్‌వైజర్లు అన్నపూర్ణమ్మ, మైథిలి, పద్మావతి, సిబ్బంది శ్రావణి, సుధాకర్, ఆశా వర్కర్లు అన్నపూర్ణ, మంజుల, లహరి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



ప్రజాశక్తి - గూడూరు: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఫిజికల్ డైరెక్టర్ పఠాన్ కరీముల్లా సూచించారు. శనివారం గూడూరు స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి షటిల్ బాడ్మింటన్, యోగా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు సుబ్రహ్మణ్యం వెంకట సుబ్బయ్య, శివ, పార్వతి, కల్పన, విజయలక్ష్మి పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో హెచ్‌డీ షటిల్ బాడ్మింటన్ ఇండోర్ స్టేడియం నిర్వాహకులు హర్షవర్ధన్ రెడ్డి, పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

కక్ష సాధింపుతోనే కేసులు





ప్రజాశక్తి -తొట్టంబేడు: కక్ష సాధింపు ధోరణితోనే శోభన్‌బాబు మరో ఇద్దరిపై కేసులు నమోదు చేశారని తాటిపర్తి గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మండలంలోని తాటిపర్తి గ్రామంలో నివాసం ఉంటున్న ఆర్ పట్టాభినాయుడుకు కుమారుడికి జరుగుతున్న వివాదంలో న్యాయం కోసం సర్దిచెప్పిన వారిపై కక్ష సాధింపుతోనే కేసులు పెట్టారని.. పద్ధతి కాదని పలువురు గ్రామస్థులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు.

వైసీపీ పాలనలో రోజూ రాజకీయమే



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రోజూ ప్రతి విషయం రాజకీయం చేస్తున్నారని తిరుపతి నగరపాలక సంస్థ టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికష్ణ అన్నారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో జరుగుతున్న పరిణామాలను చూసి విసుగు చెందిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తనపై విమర్శలు చేస్తే చెప్పులతో సమాధానం చెబుతాను అని అనడం సమంజసమేనని సమర్థించారు. ప్రతిపక్ష నేతగా నేటి సీఎం జగన్ మోహన్ రెడ్డి అప్పటి ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు నాయుడును నీచపు మాటలు అన్నారని, కాల్చి చంపాలని అన్నారని.. ఈ మాటలు అధికార పార్టీ నేతలకు గుర్తు లేదా అని ప్రశ్నించారు.కార్యక్రమంలో ఊట్ల సురేంద్ర నాయుడు, మహేష్ యాదవ్, మునిశేఖర్, సుధాకర్, అలీఖాన్, శ్రీరాములు, కోలా ప్రకాష్, వెంకటరత్నం పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థికి ప్రశంసలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థిని హరిణి గుజరాత్ రాష్ట్రంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ విశ్వవిద్యాలయంలో జరిగే ముందస్తు గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం నుంచి ఎంపికైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఎన్ఎస్-ఎస్ డిగ్రీ విభాగం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపిక కాగా.. అందులో పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని ఎంపిక కావడం విశేషం. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

పల్లూరులో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: మున్సిపల్ పరిధిలోని పల్లూరులో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు శనివారం ప్రారంభించారు. పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి పనులను పర్యవేక్షించారు. ధర్మరాజుల ఆలయం వద్ద నుంచి ఫ్లైఓవర్ వరకు రహదారికి ఇరుపక్కలా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించారు. పల్లూరు, రాజుపాలెం, సత్యనారాయణ కాలనీ, పిళ్లారిపట్టు సచివాలయాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీవోను కలిసిన రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్



ప్రజాశక్తి- బాలాయపల్లి : గూడూరు ఆర్డీవోను రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ శనివారం కలిశారు. రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్‌కి సహకరించాలని.. అసోసియేషన్ తిరుపతి జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన డిప్యూటీ తహశీల్దారు అజ్మతుల్లాఖాన్ మాట్లాడుతూ తాను ఎన్నిక కావడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బంది ఆయన్ను శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.